# కొనసాగుతున్న అభివృద్ధి పనుల పరంపర

- ఒక్క రోజే రూ. 50కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో ఉప్లూర్-డబ్బా రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

కమ్మర్‌పల్లి/ ఏర్గట్ల/ ముప్కాల్, అక్టోబర్ 2: బాల్కొండ నియోజక వర్గంలో అభివృద్ధి పనుల పరంపర కొనసాగుతున్నది. సోమవారం ఒక్క రోజే కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, ముప్కాల్ మండలాల్లో రూ.50 కోట్ల పనులకు రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి మంత్రికి ఘన స్వాగతం పలికారు. గంగపుత్రులు వలతో, మహిళలు బోనాలు, హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేంపల్లి గ్రామస్తులు మంత్రిని గజ మాలతో సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు

కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ లోలపు గౌతమీ సుమన్, రైతు నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారాంయాదవ్, సర్పంచులు బద్దం పద్మా చిన్నా రెడ్డి, అమరగోని రోజా సదాశివ్ గౌడ్, ఎంపీటీసీ పిప్పెర అనిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, యువజన విభాగ రాష్ట్ర నాయకుడు బద్దం చిన్నారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అవారి మురళి, పీఏసీఎస్ డైరెక్టర్ అవారి గంగారెడ్డి, అమరగోని సదాశివ్ గౌడ్, మాసం రాజేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల మండలంలోని ఆరు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, రైతు నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారాంయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం, వైస్ ఎంపీపీ లావణ్య, మండల కో-ఆప్షన్ మెంబర్ అస్రాఫ్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సొసైటీ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీపీ సామ పద్మా వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ బద్దం నర్సవ్వా నర్సారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే షకీల్ ఆర్థిక సాయం



ఎమ్మెల్యే తరపున సాయాన్ని అందిస్తున్న సర్పంచ్ వికార్‌పాషా

రెంజల్, అక్టోబర్2: మండలంలోని సాటాపూర్ ఉప సర్పంచ్ లతా సాయిలు ఆడబిడ్డ సాత్వికకు మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే షకీల్ ఆర్థిక సాయం అందించి బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారని సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ వికార్‌పాషా అన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో వైద్యం పొందుతున్న సాత్వికకు మెరుగైన వైద్యం కోసం బోధన్ ఎమ్మెల్యే షకీల్ అందించిన రూ.50వేల నగదు ఆర్థిక సాయాన్ని సదరు కుటుంబానికి సోమవారం అందజేశామని అన్నారు. బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు హాజీఖాన్, పార్టీ గ్రామ అధ్యక్షుడు భూమేశ్, నాయకులు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందిన వారికి హెల్మెట్ల అందజేత



యువకులకు హెల్మెట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మిస్బా

మెండోరా, అక్టోబర్2: పోచంపాడ్ గ్రామంలో సోమవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సొంత డబ్బులతో పంపిన హెల్మెట్లను సర్పంచ్ మిస్బా, గ్రామశాఖ అధ్యక్షుడు కొడిముంజ రాజు సోమవారం యువకులకు అందజేశారు. ఉచిత లెర్నింగ్ లైసెన్సులు పొందిన వారు హెల్మెట్లను ధరించి వాహనాలు జాగ్రత్తగా నడుపాలని సూచించారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి యువ సంఘాల సభ్యుల తరపున, యువకుల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్కే.ఖాదర్, మండల యూత్ అధ్యక్షులు ప్రమోద్, అర్జున్, నజీర్, నవీన్‌గౌడ్, శ్రీకాంత్, లింబయ్య, భాస్కర్‌గౌడ్, ఇర్ఫాన్, హమీద్ పాల్గొన్నారు.

## పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా సాయి కృష్ణారెడ్డి



నందిపేట్, అక్టోబర్ 2: మండల కేంద్రానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్, న్యాయవాది సాయి కృష్ణారెడ్డిని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ మూమెంట్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు హైదరాబాద్ పిరమిడ్ స్పిర్చువల్ ట్రస్ట్ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, సభ్యులు దామోదర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిరమిడ్ సొసైటీలో విశిష్ట సేవలందిస్తూ సిద్ధుల గుట్టపై నిర్మిస్తున్న శ్రీనవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ నిర్మాణం కోసం ధ్యానం శాఖాహారం, పిరమిడ్ శక్తిపై గ్రామాల్లో శాఖాహార ర్యాలీలు, ధ్యాన ఆత్మజ్ఞాన కార్యక్రమాలు, అవగాహన సదస్సులు విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తూ విశేషంగా కృషి చేస్తున్న సాయికృష్ణారెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా నియమించామని పేర్కొన్నారు.

## ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మెండోరా, అక్టోబర్2: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో నుంచి రిజర్వాయర్‌లోకి 14,588 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నదని ఏఈఈ సారిక సోమవారం తెలిపారు. కాకతీయ కాలువకు 3 వేలు, ఎస్కేప్ గేట్ల నుంచి గోదావరిలోకి 5 వేలు, సరస్వతీ కాలువకు 300, లక్ష్మి 200, గుత్ప ఎత్తిపోతల పథకానికి 270, వరదకాలువకు 5 వేలు, తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి రిజర్వాయర్‌లోకి 188.542 టీఎంసీల వరదనీరు వచ్చిందని ఏఈఈ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (90.313 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉందన్నారు.

## ఇనుప స్టాండ్లు తీయడానికి వెళ్లి నీటిలో మునిగి ఒకరి మృతి

నందిపేట్, అక్టోబర్ 2: గణేశ్ నిమజ్జనం చేసిన గణపతుల కింద ఉండే ఇనుప స్టాండ్లను తీయడానికి వెళ్లి మండల కేంద్రానికి చెందిన షేక్ హుస్సేన్ (57) నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఆదివారం ఇంటి నుంచి బయల్దేరిన హుస్సేన్ మండల కేంద్రంలోని ఊర చెరువులో ఇటీవల గణేశ్ నిమజ్జనం చేసిన ప్రాంతానికి వచ్చాడు. విగ్రహాల కింద ఉండే ఇనుప స్టాండ్లను తీసుకునేందుకు చెరువులో దిగాడు. స్టాండ్లు తీసే సమయంలో కాలు ఇరుక్కుపోవడంతో ఊపిరాడక అందులోనే మునిగి మృతి చెందాడు. కాగా సోమవారం ఉదయం మృతదేహం నీటిపై తేలడంతో మృతుడి కుటుంబీకులు గుర్తించారు. మృతుడి భార్య ఖాదర్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## మంత్రి ప్రశాంత్‌రెడ్డి కృషితో గ్రామాల అభివృద్ధి



భూమిపూజ చేస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి

బాల్కొండ, అక్టోబర్ 2 :మంత్రి ప్రశాంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కిసాన్‌నగర్‌లో సోమవారం ఎస్సీ మాల సంఘ భవనానికి మానేటి తులసీ నాగభూషణం, సాగర్‌రెడ్డి, ఎంపీటీసీ అనుగుల రాంరాజ్‌గౌడ్, స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేసి మాట్లాడారు.

కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతు శ్రీనివాస్‌గౌడ్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎంబరి శరత్, నాయకులు కొండ అశోక్, వీర్ల వెంకటేశ్వర్లు, స్వామినాథ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బోధన్ సార్వజనిక్ దేవీ నవరాత్రి ఉత్సవ కమిటీ ఎన్నిక



ఉత్సవ కమిటీ కార్యవర్గం

బోధన్, అక్టోబర్ 2: బోధన్ సార్వజనిక్ దేవీ నవరాత్రి ఉత్సవ కమిటీని సోమవారం శ్రీ చక్రేశ్వర శివమందిరంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూజారి లింగం, ప్రధాన కార్యదర్శిగా రాజుల దేవి పవన్ కుమార్, కోశాధికారిగా నంద్యాల శ్యాంలతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈ ఉత్సవ కమిటీని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో శ్రీ చక్రేశ్వర శివమందిరం చైర్మన్ బీర్కూర్ శంకర్ (బుజ్జి), డైరెక్టర్ లక్ష్మణ్‌రావు పటేల్, కౌన్సిలర్లు కందుకాల శ్రీకాంత్ గౌడ్, పిట్ల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ రుద్ర సత్యనారాయణ, నాయకులు గుమ్ముల అశోక్ రెడ్డి, సూరి, గుమ్ముల శంకర్ రెడ్డి, కిరణ్, లోకేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ వాణి, జడ్పీటీసీ విజయ

రెంజల్, అక్టోబర్2: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సర్పంచ్ వాణి, జడ్పీటీసీ విజయ సూచించారు. సోమవారం మండలంలోని బోర్గాం గ్రామంలో మంజూరైన సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ విజయాసంతోష్, వాణి సాయిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.25 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రుక్మిణీబాయి, ఉపసర్పంచ్ ఫెరోజుద్దీన్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లక్ష్మణ్, వార్డు సభ్యుడు నిజామొద్దీన్, ఖరీంపాషా తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

ఎడపల్లి, అక్టోబర్ 2: విద్యార్థుల్లో సేవాగుణం, పేదలకు సహాయం చేయడం అలవాట్లు పెంపొందిచేందుకు అనాథ శరణాలయాలకు విరాళాలు ఇస్తున్నట్లు ఇమేజ్ స్కూల్ కరస్పాండెంట్ నాగరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సారంగాపూర్ శివారులోని శాస్త్రి నగర్‌లో ఉన్న నిర్మల్ భవన్ వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ముందుగా పాఠశాలకు చెందిన విద్యార్థులతో కలిసి పాఠశాల సిబ్బంది గ్రామంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పండ్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థిని గాంధీ వేషధారణతో చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల కరస్పాండెంట్ నాగరాజు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.... వారం రోజులుగా విద్యార్థులు, తాము కలిసి సేకరించిన విరాళాలతో గాంధీ జయంతి రోజు అనాథ శరణాలయానికి సరుకులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ.12 వేల విలువ గల నిత్యావసర సరుకులు అందించామని అన్నారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ శైలజ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సరుకులను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు